క్లుప్తంగా

నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మండలంలోని చింతబండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి. జ్యోతి, కార్యదర్శి రామస్వామి, స్కూల్ కాంపెక్స్ హెడ్ మాస్టర్ బట్టు మధు, చార్టర్డ్ ప్రెసిడెంట్ సీతారాంరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు లక్ష్మారెడ్డి, విశ్వనాథం, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి

మఠంపల్లి : మండలంలోని వరదాపురంనకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం మఠంపల్లిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి సమక్షంలో బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వరదాపురం గ్రామ అధ్యక్షుడు బత్తుల సైదయ్య, కృష్ణయ్య, నారాయణ, సుశీల, కోటేష్, మార్తమ్మ, మట్టయ్య, రామచంద్రయ్య, అంజయ్య, మధు, నాగులు, గోపి, సైదులు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కవిత, తదితరులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో గల 5వ వార్డులో సీడీపీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ చింత కవితారాధారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండి.సలీం, ఆత్కూరి శేషు, రఫీ, సురేష్, రంగయ్య, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు



అరెస్టయిన అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

నడిగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను బుధవారం నడిగూడెం పోలీసులు అరెస్టు చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన అంగన్‌వాడీ కార్యకర్తలకు బీఎస్పీ నాయకులు రవి, భీమయ్య, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేపూరి సుధీర్, కాసాని గోపీనాథ్ మద్దతు తెలిపారు.

నేడు కేజీబీవీ భవనం ప్రారంభం

పాలకవీడు : మండల కేంద్రంలో రూ.3.50 కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని గురువారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రారంభించనున్నట్లు, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు, మేధావులు, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాలి

హుజూర్‌నగర్ : రాబోయే ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ హుజూర్‌నగర్ నాయకుడు మారగాని సైదులు అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ గెలిపించాలని ఆయన కోరారు.

డీలర్లకు కమీషన్ పెంచడం హర్షణీయం

హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ పెంచడం హర్షణీయమని ఆ సంఘం నాయకులు అన్నారు. కమీషన్ పెంపునకు కృషి చేసిన ఎమ్మెల్యే సైదిరెడ్డిని బుధవారం హుజూర్‌నగర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. మండల రేషన్ డీలర్ సంఘం నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

జన చైతన్య ట్రస్ట్ సభ్యులకు సన్మానం

హుజూర్‌నగర్ : పట్టణంలో రక్తదానంతో పాటు పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్న జన చైతన్య ట్రస్ట్ సభ్యులను బుధవారం స్వాతి హాస్పిటల్ డాక్టర్ శేఖర్ సన్మానించారు. ట్రస్ట్ నిర్వాహకులు వంశీ, శంకర్, రమేష్, శ్రీపతి సభ్యులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంత.. తీరని చింత

మున్సిపల్ కార్యాలయంలో సక్రమంగా నిర్మించని ఇంజనీర్లు

- రెండుసార్లు నిర్మించినా విఫలమే
- ప్రమాణాలు గాలికొదిలేసి భూమికి ఎత్తుగా ఏర్పాటు
- వర్షపు నీరు ఇంకక వానొస్తే చెరువును తలపిస్తున్న కార్యాలయం
- కోట్ల రూపాయల పనులు ఎలా పర్యవేక్షిస్తున్నారోనని విమర్శలు



ఇంకుడుగుంత చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించని అధికారులు



మొదట నిర్మించిన ఇంకుడు గుంతపై పాత సామన్లు వేసిన సిబ్బంది

కోదాడ : కోదాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షించే ఇంజనీరింగ్ విభాగం అధికారులు తమ మున్సిపల్ కార్యాలయంలో మాత్రం ఇంకుడు గుంతను సక్రమంగా నిర్మించలేకపోతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీలో డీఈఈ, ఇద్దరు ఏఈలు, మరో టెక్నికల్ ఏఈ పని చేస్తున్నారు.. అయినా ఇంకుడు గుంతను సరిగ్గా నిర్మించలేకపోవడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇప్పటికే రెండుసార్లు ఇంకుడు గుంత నిర్మించినప్పటికీ అధికారులు నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించలేదు. మూడు ఏళ్ల క్రితం రూ.25 వేలతో ఇంకుడు గుంతను భూమట్టానికి కన్నా ఎత్తులో నిర్మించడంతో దానిలోకి చుక్క నీరు వెళ్లడం లేదు. దీంతో ఇటీవల కార్యాలయ ఆవరణలో దాదాపు రూ.45 వేలు ఖర్చు చేసి మరో ఇంకుడు గుంత నిర్మించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అక్కడ ఇంకుడు గుంత ఉందని ఇంజనీరింగ్ అధికారులు వచ్చి చూపిస్తే తప్పా నరమానవుడు కనుక్కోలేని విధంగా నిర్మించారు.

చెరువును తలపిస్తుండడంతో..

అయితే మూడు ఏళ్ల క్రితం కార్యాలయంలో ఇంకుడుగుంతను ఎత్తులో నిర్మించడంతో దానిలోకి చుక్క నీరు పోకపోవడంతో ఆ ప్రదేశంలో అధికారులు పాత సామన్లు వేసి ప్రజలకు కనపడకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే మున్సిపల్ కార్యాలయంలో పాతబావి ఉంది. దీని నుంచి నీరు బయటకు వెళ్లాలి. కానీ మున్సిపల్ కార్యాలయం ఉత్తరం వైపు ఆక్రమణకు గురికావడంతో నీరు బయటకు వెళ్లడం లేదు. ఆక్రమణలను అధికారులు తొలగించలేక పోయారు. దీంతో వర్షం వచ్చినపుడు కార్యాలయం చెరువును తలపిస్తుండడంతో దీని పరిష్కారం కోసం బావి సమీపంలో ఇంకుడు గుంతను నిర్మించారు. దీనిలో కనీస ప్రమాణాలు పాటించలేదు. కనీసం ఇంకుడుగుంత చుట్టూ ప్లాట్‌ఫాం కూడా నిర్మించకుండా వదిలేశారు. ఒకసారి విఫలమైన అధికారులు కనీసం రెండవసారైనా జాగ్రత్తలు తీసుకొని చేయాల్సిన పనిని అడ్డదిడ్డంగా చేసి వదిలేశారు. ఇలాంటి అధికారులు కోట్ల రూపాయల పనులను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారో చెప్పాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు.

పనుల్లో నాణ్యత లేదు



లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న ఇంజనీరింగ్ అధికారులు తమ కార్యాలయంలో రెండుసార్లు ఇంకుడుగుంతను సక్రమంగా నిర్మించలేకపోవడం విడ్డూరం ఉంది. పతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మాణం చేయాలని ముందుగానే డబ్బులు వసూలు చేస్తున్న మున్సిపాలిటీ తన కార్యాలయంలోనే ఇంకుడు గుంతను నిర్మించుకోలేకపోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కోదాడ మున్సిపాలిటీలో కోట్ల రూపాయల ఇంజనీరింగ్ పనుల్లో కనీస నాణ్యత ఉండడం లేదు. దీనిపై ఉన్నతాధికారుల చర్యలు తీసుకోవాలి.

– కుదరవెళ్లి బసవయ్య, కోదాడ

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



చిలుకూరు : నారాయణపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

చిలుకూరు : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బుధవారం చిలుకూరు మండలంలోని జానకీనగర్, దూదియాతండా, సీత్లాతండా, నారాయణపురం, సీతారాంపురం గ్రామాల్లో నిర్వహించిన 'గడపగడపకు కాంగ్రెస్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దశాబ్ద కాలంగా రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి చేసిందేమి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మునగాల : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిరవధిక సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లకు ఆమె సంఘీభావం తెలిపారు. అనంతరం సమ్మెను ఉద్దేశించి మాట్లాడారు. అతితక్కువ వేతనం ఇచ్చి ఆశా వర్కర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయుంచుకుంటుందని ఆరోపించారు. అనంతరం ఆశా వర్కర్ల సంఘం నాయకులు పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఆమె వెంట మునగాల ఎంపీటీసీ కాసర్ల కల్పన, ఉప్పుల రజిత, వైఎస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపాయ్య, కాంగ్రెస్ మండల నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, కాసర్ల బోస్, కోటేశ్వరరావు, వీరబాబు, జానకిరెడ్డి, రవి, వెంకట్, సీఐటీయూ నాయకుడు రాధాకృష్ణ ఉన్నారు.

హామీ అమలు చేయకపోవడం శోచనీయం

కోదాడ : మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి కోరారు. కోదాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద గత 7 రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించి కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికుల వేతనం రూ. వెయ్యి నుంచి రూ. 3 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి 9 నెలలు కావస్తున్నా ఇంతవరకు అమలు కాకపోవడం శోచనీయమన్నారు. త్వరలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తుందని తెలిపారు. ముత్యాలు, సత్యనారాయణ, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో ఓటు చూసుకోవాలి

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ ఓటు ఉందో, లేదో చూసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి బీఎల్‌ఓల దగ్గర తుది ఓటరు జాబితా ఉంచామని ప్రతిఒక్కరూ చెక్ చేసుకోవాలని, ఓటు లేనట్టైతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఓటరు జాబితా మార్పులు, చేర్పులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఏఓ నారాయణ, డీటీ కమలాకర్, సీనియర్ అసిస్టెంట్ అప్పారావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోతి సంపత్‌రెడ్డి, కేఎల్ఎన్ రావు, చంద్రశేఖర్, ఆర్.నవీన్, నర్సింహారావు, నాగార్జున, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కోదాడ : ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



మఠంపల్లి : భిక్షాటన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కోదాడ : మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. కోదాడ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఆర్డీఓ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు బుధవారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ముత్యాలు, గీత, అన్నపూర్ణమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై గల దుకాణాల వద్ద భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా, శాంతాకుమారి, ధనమ్మ, లచ్చీరాం, గోవిందమ్మ, సాలమ్మ, సత్యవతి, పద్మ, లక్ష్మి, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి విద్యార్థులకు భోజనం

నడిగూడెం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం నడిగూడెంకు వచ్చిన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని, అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, మణెమ్మ, ఉమ, ఉపేంద్రమ్మ, అంజమ్మ, ధనమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మేళ్లచెరువు : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు మాట్లాడుతూ కార్మికులకు రూ. 18 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అదించాలన్నారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దానయ్య, ప్రమీల, సైదమ్మ, నాగేంద్రమ్మ, భూలక్ష్మి, అచ్చుతరావు, పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీపై హర్షం

నడిగూడెం : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వస్తువులను పంపిణీ చేయడంపై శుక్రవారం కోదాడ డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పాతకొట్ల ప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేయలేదన్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడ : క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



మునగాల : యువతకు క్రీడా సామగ్రి కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. యువత కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన క్రీడా సామగ్రి కిట్లను బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు యువతను పట్టించుకోలేదన్నారు. నేడు రాష్ట్రంలో క్రీడాకారుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడా మైదానాలు ఏర్పాటు చేసిందన్నారు. క్రీడాకారులకు 31 రకాల క్రీడా పరికరాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఎంపీపీ ఎలక బిందు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, పార్టీ మండల నాయకులు సుంకర్ అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ, ఉప్పుల యుగంధర్ రెడ్డి, ఉడుం కృష్ణ, ఎలక నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు చింతకాయల ఉపేందర్, కొండపల్లి విజయమ్మ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నడిగూడెం : క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు మంజూరైన క్రీడా సామగ్రిని బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, కాగితరామచంద్రాపురం పీఏసీఎస్ చైర్మన్ గోసుల రాజేష్, స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, నాయకులు, పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

కోదాడ : తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, క్రీడాకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, ఎంఈఓ సలీంషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే

కోదాడ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రభుత్వం కార్యాలయాలను ఏర్పాటు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యానారాయణ, తహసీల్దార్ సాయాగౌడ్, ఎంపీపీ కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

మోతె : సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో యువతకు క్రీడా సామగ్రి, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఎంపీఓ హరిసింగ్, ఏపీఎం నర్సింహులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం : ఎమ్మెల్యే



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



గరిడేపల్లి : కీతవారిగూడెంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులను క్రీడా సామగ్రి పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని మతాలకు, అన్ని పండుగలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదు

హుజూర్‌నగర్‌రూరల్ : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేపలసింగారంలో వాగుపై రూ.18 లక్షలతో నిర్మించిన మేజర్ బ్రిడ్జిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కరక్కాలయగూడెంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌పై రూ.49.10 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ఎన్ఎస్‌పీ ఏఈ, సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. తదనంతరం బూరుగడ్డలో డబుల్ బెడ్ రూం ఇళ్ల శిలాఫలకం ఆవిష్కరించి, 30 డబుల్ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, 220 ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, యువతకు క్రీడా కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కొందరు దొంగ మాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసే విషయంలో పోటీ పడాలే కానీ అభివృద్ధిని అడ్డుకోద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండి నిరుపేదలకు గజం జాగ మంజూరు చేసిన దాఖలాలు లేవని, కనీసం నెలకు ఒకసారి అయినా నియోజకవర్గంలోని గ్రామాలను సందర్శించిన పాపాన పోలేదని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి యాదయ్య, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీ లావణ్య, సర్పంచ్‌లు అన్నెం శిరీషాకొండారెడ్డి, షేక్ సలీమారంజాన్, కీత జయమ్మధనమూర్తి, ఎంపీటీసీలు గోపిరెడ్డి, వెంకటేశ్వర్లు, అలీపాషా, ఎన్ఎస్‌పీ ఏఈ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్లను సహకరిస్తా

హుజూర్‌నగర్ : ఫొటో, వీడియో గ్రాఫర్లకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో జరిగిన మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఫొటోగ్రఫి పితామహులు డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన ఫొటోగ్రాఫర్లకు సంతాపం తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారికి నియామకపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర, జిల్లా మండల నాయకులు ఆర్.శ్రీనివాస్, కె.లాలయ్య, బి.లాలు, లక్ష్మణ్, రవి, శ్రీనివాసాచారి, కృష్ణ, హరి, శ్రీకాంత్, వీరేష్, రామారావు, వెంకన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో బుధవారం ఎమ్మెల్యే సైదిరెడ్డి మహిళలకు బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ జ్యోతి, ఎంపీపీ పద్మ, ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, సర్పంచ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో యువతకు క్రీడా సామగ్రి కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాత, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బండా కవిత, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతి, ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, శంభిరెడ్డి, సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలి

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బుధవారం బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించారు. అదేవిదంగా యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, ఎంపీడీఓ జానకిరాములు, సర్పంచ్ కృష్ణవేణి గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



నేరేడుచర్ల : పుల్లంబండతండాలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సైదమ్మ



హుజూర్‌నగర్‌రూరల్ : బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

నేరేడుచర్ల : మండలంలోని పుల్లంబండతండాలో మహిళలకు సర్పంచ్ బాదావత్ సైదమ్మ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రమావత్ సైదా, నాయకులు బాణోతు బాలు, బాణోతు సైదా తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక సర్పంచ్ జోగు సరోజనిపిచ్చిరెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సైదిరెడ్డి, వార్డు సభ్యులు సైదిరెడ్డి, పకీర, రవి, హెచ్ఎం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక

హుజూర్‌నగర్‌రూరల్ : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వేపలసింగారంలో ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డితో కలిసి బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ కోట్ల రూపాయలు వెచ్చించి విజయ దశమి కానుక అందిస్తున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నె సావిత్రి, కార్యదర్శి పెండెం నాగమణి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

5 శాతం ఐఆర్ ప్రకటించడం అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 5 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించడం అన్యాయమని పెన్షనర్ల సంఘం నాయకులు అన్నారు. ఐఆర్‌పై ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం హుజూర్‌నగర్‌లోని మండల ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్షంగా మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించిందని, ఐఆర్ కేవలం ఐదు శాతం ఇవ్వటం శోచనీయమన్నారు. ఈ విషయంలో సీఎం పునరాలోచన చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల అధ్యక్షులు సోమయ్య, కోటయ్య, నాయకులు వీరారెడ్డి, మొయినుద్దీన్, చంద్రశేఖర్, నర్సిరెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్‌రావు, నరసయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య, ఎల్.వెంకటేశ్వర్లు, కోటయ్య, సైదులు, నారాయణరెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

మోతెలో ఐదుగురికి కానిస్టేబుల్ ఉద్యోగాలు

మోతె : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో మోతె గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. నకిరకంటి సందీప్ (సివిల్), చింతల హరీష్ (సివిల్), నిమ్మనగోటి ప్రసన్న (టీఎస్ఎస్‌పీ), రఘు పాత్రుని స్వరూప్ (టీఎస్ఎస్‌పీ), కల్పగిరి సంపత్ (టీఎస్ఎస్‌పీ) కానిస్టేబుల్స్ ఉద్యోగాలు సాధించారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగితరామచంద్రాపురం పీఏసీఎస్ చైర్మన్ గోసుల రాజేష్ కోరారు. బుధవారం కాగితరామచంద్రాపురం సహకార సంఘం కార్యాలయంలో అదే గ్రామానికి చెందిన రైతు కుంభం వీరయ్యకు కోళ్ల ఫారం ఏర్పాటుకు రూ.10 లక్షలు రుణం చెక్కును అందజేసి మాట్లాడారు. సీఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఆశా వర్కర్ల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న ఆశా వర్కర్లు

చిలుకూరు : తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఆశా వర్కర్లు బుధవారం చిలుకూరులో ఇంటింటికి తిరుగుతూ భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశా వర్కర్లు మాట్లాడుతూ తమ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.